నేడు రాష్ట్రస్థాయి సైక్లింగ్‌కు క్రీడాకారుల ఎంపిక

రామాయంపేట, నవంబర్ 2: రామాయంపేటలో నేడు రాష్ట్ర స్థాయి సైక్లింగ్ క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు జాతీయ స్థాయి సైక్లింగ్ క్రీడాకారుడు, ఖేల్ ఇండియా కోచ్ దండు యాదగిరి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని క్రీడా మైదానంలో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 4, 5, 6 తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీలను జనగామ జిల్లాలో నిర్వహిస్తున్నట్లు, ఈ పోటీల్లో పాల్గొనేందుకు మెదక్ జిల్లా నుంచి రామాయంపేటలోని క్రీడా మైదానంలో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రామాయంపేటలో నిలిచిపోయిన సర్వే

రామాయంపేట, నవంబర్ 2: రామాయంపేటలోని సమగ్ర కుటుంబ కులగణన సర్వే ఒక్కరోజుకే నిలిచిపోయింది. ప్రభుత్వం అధికారులు ఎంతో హడావిడిగా ప్రారంభించిన సర్వే శనివారం ఉంటుందనుకుని రామాయంపేటలో వార్డుల బాటపట్టిన కొద్ది క్షణాల్లోనే అధికారులు నిలిపేయమనడంతో కులగణనకు వచ్చిన అధికారులు వచ్చిన దారినే వెనుదిరిగి వెళ్లిపోయారు. ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా చేపట్టిన కులగణనను ఆపేయడంతో పట్టణ ప్రజలు అయోమయానికి గురయ్యారు. త్వరలోనే మళ్లీ కలెక్టర్ ఆదేశాలతో ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

నర్సాపూర్, నవంబర్ 2: కడుపునొప్పి భరించలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో జరిగింది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డిపల్లి గ్రామానికి చెందిన నక్క రఘుపతి(32) ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కొన్ని రోజుల నుంచి కడుపునొప్పితో బాధపడేవాడు. దవాఖానలో చూపించినా నొప్పి తగ్గలేదు. కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టడం ఇష్టం లేక గత 30న తన వ్యవసాయ భూమి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తులు చేస్తున్నారు.

పాఠశాలకు డెస్కులు, కంప్యూటర్ బహూకరణ

చిన్నశంకరంపేట, నవంబర్ 2: ఖాజాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు ప్రభాకర్‌రావు, రాజేశ్వరరావు డెస్కులు, కంప్యూటర్, బీరువాను శనివారం బహూకరించారు.

జిల్లా సేవాదళ్ అధ్యక్షుడిగా యుగేంధర్‌రావు

రామాయంపేట, నవంబర్ 2: జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడిగా రామాయంపేటకు చెందిన యుగేంధర్‌రావును నియామించారు. శనివారం హైదరాబాద్‌లోని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు స్వగృహంలో నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పీసీసీ కార్యదర్శి చౌదరి సుప్రభాతరావు ఉన్నారు.

చెట్టుకు ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

టేక్మాల్, నవంబర్ 2: చెట్టుకు ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన టేక్మాల్ మండలం వెంకటాపూర్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఏఎస్ఐ తుక్కయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రం మాదేపూర్ జిల్లా పరమానందపూర్ గ్రామానికి చెందిన ముఖేశ్ పాశ్వాన్(34) పాపన్నపేటలో ఉంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. శనివారం మండలంలోని డాక్యాతండాకు పనికి వెళ్లాడు. పని చేస్తున్న సమయంలో తన భార్యతో ఫోన్లో మాట్లాడి గొడవపడ్డాడు. ఆవేశంతో సమీపంలోని సున్నం గుట్టపై చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తోటి కూలీలు అతని ఆచూకీ కోసం గాలించగా చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. అప్పటికే ముఖేశ్ పాశ్వాన్ మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి బావ అనిల్ పాశ్వాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తుక్కయ్య తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన మున్సిపల్ కమిషనర్

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 2: మెదక్ మున్సిల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌రెడ్డి శనివారం మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావును కలిశారు

కొనుగోలు సరే.. తరలింపు ఎప్పుడో?

చిలిపిచెడ్‌లోని పీఏసీఎస్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం కుప్పలు

చిన్నశంకరంపేట కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు రాజు

చిలిపిచెడ్ మండలంలో ఇబ్బందులు పడుతున్న రైతులు

చిలిపిచెడ్, నవంబర్ 2: చిలిపిచెడ్ మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. కానీ ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించడంలేదు. దీంతో రైతులు ఎప్పుడు తరలిస్తారని ఎదురుచూస్తున్నారు. కొనుగోలు కేంద్రం ప్రారంభించి 15 రోజులు గడుస్తున్నా, ఇప్పటికీ ఒక్క బస్తా తూకం వేయలేదు, రైస్‌మిల్లుకు తరలించలేదు. గన్నీ బ్యాగుల కోసం ఎదురుచూపులూ తప్పడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షాలకు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దవుతున్నా పట్టించుకునే నాథుడులేడు. ఐకేపీ ఏపీఎం ప్రేమలతను వివరణ కోరగా.. ఇంకా రైస్‌మిల్లుకు ఆదేశాలు రాలేవని, సోమవారం వస్తుండచ్చని, వెంటనే ధాన్యాన్ని లారీల్లో రైస్ మిల్లులకు తరలిస్తామని తెలిపారు.

దీపావళి దాటినా వడ్లు కొనరా?

శివ్వంపేట, అక్టోబర్ 2: మండలంలో దీపావళి పండుగ దాటినా ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎందుకు ప్రారంభించడం లేదని నర్సాపూర్ ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభించకపోవడం సిగ్గుచేటన్నారు. రైతులు కేంద్రాల కోసం ఎదురుచూస్తున్నారని, వారి బాధలు ప్రభుత్వానికి పట్టవా అని ప్రశ్నించారు.

గొర్రె వెంకట్‌రెడ్డి

ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

నర్సాపూర్, నవంబర్ 2: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని వెంటనే కొనాలని తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు మైసయ్య యాదవ్ డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం వెంటనే కొనేలా ప్రభుత్వం అధికారులకు వెంటనే ఆదేశాలివ్వాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ధాన్యం తడిసిపోయిందన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలని డిమాండ్ చేశారు.

రైతులను ఆగం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

మైసయ్య యాదవ్

చిన్నశంకరంపేట, నవంబర్ 2: రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయక రైతులను అయోమయానికి గురి చేస్తుందని బీజేపీ నాయకుడు మల్లారెడ్డి ఆరోపించారు. శనివారం చిన్నశంకరంపేటలో మాట్లాడుతూ అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా కొనాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 20 రోజులు గడిచినా ధాన్యాన్ని ఎందుకు కొనడం లేదని ప్రశ్నించారు. నాయకులు నర్సింలు, దత్తు ప్రకాశ్, దశరథం, శ్రీనివాస్, నాగరాజు ఉన్నారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలి

మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

చిన్నశంకరంపేట, నవంబర్ 2: అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలని బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు పట్లోరి రాజు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని గవ్వలపల్లి చౌరస్తాలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఆయనతో నాయకులు స్వామి, నరేశ్, రాజు, రైతులు ఉన్నారు.

మిల్లర్లు త్వరగా ధాన్యం దించుకోవాలి

- కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, నవంబర్ 2(నమస్తే తెలంగాణ) : బ్యాంకు గ్యారంటీ, అండర్ టేకింగ్ అందజేసి, వీలైనంత తొందరగా ధాన్యం దిగుమతి ప్రారంభించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ మిల్లర్లకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లాలోని రైస్ మిల్లర్స్‌తో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు, దిగుమతిపై సూచనలు సలహాలు అందజేశారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం మిల్లర్లు ప్రభుత్వానికి సహకరించాలన్నారు. జిల్లాలో రైతుల ధాన్యం వచ్చి ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్నదని, అకాల వర్షాలు కూడా రైతులపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున జిల్లాలోని మిల్లర్లు త్వరితగతిన బ్యాంకు గ్యారంటీ, అండర్ టేకింగ్ అందజేసి వీలైనంత తొందరగా ధాన్యం దిగుమతి ప్రారంభించాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేశ్, జిల్లా మేనేజర్ హరికృష్ణ, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సురేశ్‌రెడ్డి, మిల్లర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు చర్యలు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ పథకం కింద వయోజన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర పాఠశాల విద్య సంచాలకుడు నరసింహారెడ్డి, రాష్ట్ర వయోజన విద్య సంచాలకురాలు ఉషారాణితో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉల్లాస్ పథకం కింద అక్షరాస్యులుగా తీర్చిదిద్దే కార్యక్రమ పురోగతిని సమీక్షించారు. మెదక్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ సిస్టం కింద జిల్లాలో వయోజనులను అక్షరాసులుగా చేసే లక్ష్యం, ప్రతి ఐదుగురి వయోజనులకు ఒక వలంటరీ చొప్పున వలంటీర్ల ద్వారా వయోజనులను అక్షరాస్యులుగా చేయనున్నట్లు తెలిపారు. దీనికిగాను సంబంధిత శాఖల అధికారులతో జిల్లాస్థాయి కమిటీని ఏర్పాటు చేసి ప్రతి పక్షం రోజులకు ఒకసారి సమీక్షించనున్నట్లు తెలిపారు. ప్రాథమిక అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, ఆరోగ్య సంరక్షణ, కుటుంబ సంక్షేమం తదితర జీవన నైపుణ్యాలతో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం ఉల్లాస్ పథకం లక్ష్యమన్నారు. కాన్ఫరెన్స్‌లో జడ్పీ సీఈవో ఎల్లయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయ, జిల్లా సమైఖ్యలు సుదర్శన్ మూర్తి, సతీశ్ కుమార్, వయోజన విద్య అనిల్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

హామీలన్నీ కాంగ్రెస్ నెరవేరుస్తుంది

- సమగ్రకులగణన కాంగ్రెస్‌తోనే సాధ్యం
- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్

మెదక్, నవంబర్ 2(నమస్తే తెలంగాణ): బడుగు బలహీన వర్గాల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేయనున్నదని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. శనివారం మెదక్‌లోని ద్వారకా గార్డెన్స్‌లో నిర్వహించిన సమగ్ర కులగణన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ చేపట్టిన సమగ్ర కులగణనతో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతందన్నారు. బీసీలు కులాల వారీగా విడిపోవద్దని, అలా జరిగితే బీసీల ఎదుగుదల కుంటుపడే అవకాశం ఉంటుందన్నారు. బీసీలు ఐక్యతతో ఉంటేనే అన్ని అవకాశాలు దక్కుతాయన్నారు. మెదక్ నియోజకవర్గంలో ఎన్నో గ్రామాల్లో సొంతగా బోర్లను వేయించారన్నారు. అధికారంలో లేకున్నా కూడా గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీపీలు, జడ్పీటీసీలను గెలిపించుకున్నామని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకుడు హన్మంతరావు, డీసీసీ అధ్యక్షుడిగా ఆంజనేయులుగౌడ్, నర్సాపూర్ ఇన్‌ఛార్జి ఆవుల రాజిరెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ నాయకులు ఉప్పల రాజేశ్, బొజ్జ పవన్, సుప్రబాత్, గంగా నరేందర్, రాజిరెడ్డి, పేరూర్ శంకర్, శ్రీనివాస్ చౌదరి, పబ్బతి ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్, కౌన్సిలర్‌లు దొంతి లక్ష్మి ముత్యం గౌడ్, దాయర లింగం, ఆవారి శేఖర్, శమీ, బొద్దులు రుక్మిణి క్రిష్ణ, విజయలక్ష్మి, మందుగుల గంగాధర్, బోయని అరుణ, పరుశురాం గౌడ్, తాహేర్, ఉమర్, మహేశ్ గౌడ్, వెంకట్ గౌడ్, రాంచందర్ గౌడ్, అశోక్, లక్కరు శ్రీనివాస్, శ్రీకాంత్, హపీజ్ మొల్సాబ్, దాయర రవి, గూడూరి అరవింద్‌తో పాటు వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డులతో ఆత్మీయ సమావేశం

ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న హోంగార్డులు

మెదక్ అర్బన్, నవంబర్ 2: హోంగార్డుల సమస్యలు పరిష్కారించేందుకు కృషి చేస్తామని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో హోంగార్డులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. హోంగార్డ్ సిబ్బందికి యూనిఫామ్ అలవెన్స్ త్వరలో అందజేస్తామన్నారు. రెయిన్ కోట్స్, హెల్త్ కార్డు గురించి ఉన్నతాధికారులకు ప్రపోజల్స్ పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, సాయుధ దళ డీఎస్పీ రంగనాయక్, హోంగార్డు ఇన్‌చార్జి శ్రావణ్ పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలను వీడాలి

విద్యార్థి చేతిపై మంటలు లేపుతున్న నరేశ్

నర్సాపూర్, నవంబర్ 2: విద్యార్థి దశ నుంచే మూఢనమ్మకాలు వీడాలని సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు నరేశ్ సూచించారు. శనివారం మండలంలోని చిప్పల్‌తుర్తి గ్రామ సమీపంలో గల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు సీఐ జాన్‌రెడ్డి ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం–సైన్స్– మూఢ నమ్మకాల నిర్మూలన అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. నరేశ్ మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ సమాజ నిర్మాణానికి నడుం బిగించాలన్నారు. దొంగస్వాములు, భూత వైద్యులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని ఆర్థికంగా, సామాజికంగా మోసం చేస్తున్నారన్నారు. డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మాంత్రికులు, భూత వైద్యులు చేసే మోసాలు, కుట్రలను సైన్స్ మ్యాజిక్ షోతో వాటి వెనుక దాగి ఉన్న రహస్యాలను వివరించారు. ఎస్సై శ్రీనివాస్, ఏఎస్ఐ కృష్ణ, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మమత, సిబ్బంది గోపాల్, మోహన్, ప్రణతి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

కిశోర్‌రెడ్డి(ఫైల్)

వెల్దుర్తి, నవంబర్ 2: విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసిస్తూ పండుగకు స్వగ్రామానికి వచ్చిన విద్యార్థి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బాధిత కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అరెగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, సహకార సంఘం మాజీ డైరెక్టర్ వెన్నవరం మహిపాల్‌రెడ్డికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు యూకేలో ఉన్నత విద్యనభ్యసించి స్వదేశానికి వచ్చి సాఫ్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. చిన్న కుమారుడు సాయికిశోర్‌రెడ్డి(25) లండన్‌లో ఎంబీఏ చదువుతున్నాడు. దసరాకు స్వదేశానికి వచ్చిన సాయికిశోర్‌రెడ్డి కొంపల్లిలో ఉన్నాడు. శనివారం తెల్లవారుజామున స్నేహితుడితో కలిసి బైక్‌పై వెళ్తుండగా రోడ్డుపై ఉన్న డైనేజీ పైపులను బైక్ ఢీకొట్టడంతో వెనక కూర్చున్న సాయికిశోర్‌రెడ్డి ఎగిరిపడి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న అన్ని పార్టీ నాయకులు మహిపాల్‌రెడ్డిని, వారి కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

మృతుడి కుటుంబీకులను పరామర్శించిన ఎంపీ

నర్సాపూర్, నవంబర్ 2: సంగారెడ్డి జిల్లా హత్నూరా మండలం బడంపేట్ గ్రామానికి చెందిన బీజేపీ బూత్ అధ్యక్షుడు కొమురయ్య మృతి చెందాడు. విషయం తెలిసిన మెదక్ ఎంపీ రఘునందన్‌రావు నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కప్పేసిన మంచు దుప్పటి

చిన్నశంకరంపేట:లైట్లు వేసుకుని వెళ్తున్న వాహనదారులు

చిన్నశంకరంపేటలో కప్పేసిన పొగమంచు



నిజాంపేటలో కురుస్తున్న పొగమంచు

నిజాంపేట/చిన్నశంకరంపేట, నవంబర్ 2: నిజాంపేట మండల వ్యాప్తంగా శనివారం పొగమంచు కురిసింది. దీంతో వాహనదారులు హెడ్‌లైట్ వేసుకుని ప్రయాణించారు. చలి ప్రభావం రోజురోజుకు పెరుగుతున్నదని చిన్నారులు, వృద్ధులు బయటకు రావొద్దని వైద్యులు సూచిస్తున్నారు. చిన్నశంకరంపేట మండలంలోని ఆయా గ్రామాల్లో పొగమంచు కప్పేసింది దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కానరాక వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం 8 గంటలు దాటినా మంచు కప్పేయడంతో వాహనదారులు లైట్లు వేసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★Supervisors, Sales Exicutives, Team Leaders, Dealers for a Car & Bike Polish Company. Free Room & Cooking facility. Ph: 8019399008.
NT-339365-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న, లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

విద్యార్థిని చితకబాదిన టీచర్

ఉపాధ్యాయుడితో తల్లిదండ్రుల వాగ్వాదం

నర్సాపూర్, నవంబర్ 2: విద్యార్థిని ఉపాధ్యాయుడు బెల్టుతో చితకబాదిన ఘటన మండలంలోని బ్రాహ్మణపల్లి జడ్పీహెచ్ఎస్‌లో శనివారం జరిగింది. విద్యార్థి తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రాహ్మణపల్లి జడ్పీహెచ్ఎస్‌లో మనోజ్‌కుమార్ యాదవ్ 9వ తరగతి చదువుతున్నాడు. శనివారం పాఠశాలకు వెళ్లిన మనోజ్‌ను ఉపాధ్యాయుడు మల్లయ్య తరగతి గదిలో బెల్టు తీసి ఇష్టానుసారంగా కొట్టాడు. ఈ విషయం మనోజ్ తన తల్లిదండ్రులకు తెలుపగా వారు పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయుడితో వాగ్వాదానికి దిగారు. నెల రోజుల క్రితం పాఠశాలలో పరీక్ష నిర్వహించగా హాజరు కాలేదని, ఎందుకు రాయలేదని ఉపాధ్యాయుడు బెల్టుతో చితకబాదినట్లు విద్యార్థి తెలిపాడు. ఈ విషయంలో తల్లిదండ్రులు ప్రశ్నించారు. తమ కుమారుడిని కొట్టినందుకు ఉపాధ్యాయుడిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మెస్, కాస్మొటిక్ చార్జీల పెంపుపై హర్షం

హర్షం వ్యక్తం చేస్తున్న ప్రిన్సిపాల్, విద్యార్థులు

కౌడిపల్లి, నవంబర్ 2: గురుకుల విద్యార్థులకు ప్రభుత్వం మెస్‌చార్జీలు, కాస్మొటిక్ చార్జీ లు పెంచడంతో సర్వత్ర హర్షాతిరేకాలు వెల్లివిరుస్తున్నాయి. కౌడిపల్లిలోని గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో ప్రిన్సిపాల్ ఫణికుమార్, వైస్ ప్రిన్సిపల్ భవానీ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులు ఉపాధ్యాయులు బ్యా నర్ ప్రదర్శిస్తూ ప్రజాపాలన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రేవంత్‌రెడ్డి గురుకులాలపై ప్రత్యేక శ్రద్ధతో మెస్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలు పెంచడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ భవాని, అధ్యాపకులు మంజుల, రజిత, డాక్టర్ శ్రీనివాస్, ధర్మరాజు, స్రవంతి, రవి, రమేశ్, రామకృష్ణ, నరేశ్, రహీం పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

సోలార్ ఉత్పత్తి పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

చిన్నశంకరంపేట, నవంబర్ 2: ఒకేషనల్ విద్యార్థులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ శశిధర్ సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ విద్యార్థులకు సోలార్ ఉత్పత్తిపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణ రెండు నెలల పాటు కొనసాగుతుందన్నారు. ఏటీవో ఏసీస్ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఒకేషనల్ అధ్యాపకుడు లక్ష్మీపతి, ఆధ్యాపకులు శ్రీవాణి, విక్రమ్, తిరుపతి, ఇంద్రారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కన్నతండ్రికి కూతురు ఖర్మకాండ

తండ్రికి ఖర్మకాండ నిర్వహిస్తున్న కూతురు

చిన్నశంకరంపేట, నవంబర్ 2: కన్నతండ్రికి కూతురు ఖర్మకాండ నిర్వహించిన ఘటన మల్లుపల్లిలో శనివారం జరిగింది. మండలంలోని మల్లుపల్లి గ్రామానికి చెందిన ధ్యానబోయిన దశరథం(42) రెండు రోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. దశరథంకు భార్య విజయ, ఇద్దరు కూతుళ్లు శిరీష, రమ్య ఉన్నారు. పెద్ద కూతురు శిరీషకు పెండ్లి అయ్యింది. దీంతో చిన్న కూతురు రమ్యతో తండ్రి ఖర్మకాండ జరిపించారు.

వడ్ల కుప్పను ఢీకొని యువకుడికి గాయాలు

చిన్నశంకరంపేట, నవంబర్ 2: ద్విచక్ర వాహనంపై వెళ్తూ వడ్ల కుప్పను ఢీకొని ఓ యువకుడికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని సంగాయపల్లి గ్రామ శివారులో శుక్రవారం రాత్రి జరిగింది. మండలంలోని గజగట్లపల్లి గ్రామానికి చెందిన బత్తిని రమేశ్ గవ్వలపల్లి చౌరస్తా నుంచి తన ద్విచక్రవాహనంపై గజగట్లపల్లికి వెళ్తుండగా సంగాయపల్లి గ్రామ శివారులోకి రాగానే రోడ్డుపై ఆరబెట్టిన వడ్లకుప్పను బలంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రమేశ్‌కు చేయి విరిగింది. తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వెంటనే 108 వాహనంలో మెదక్ దవాఖానకు తరలించారు.

కులగణనను సద్వినియోగం చేసుకోవాలి

మాట్లాడుతున్న ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు మానెగల్ల రామకిష్టయ్య

రామాయంపేట, నవంబర్ 2: జిల్లా వ్యాప్తంగా ఉన్న ముదిరాజ్ సంఘం కులస్థులు ప్రభుత్వం చేపట్టిన కులగణనను సద్వినియోగం చేసుకోవాలని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు మానెగల్ల రామకిష్టయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుట్టి అక్షయ్‌లు పేర్కొన్నారు. శనివారం రామాయంపేట పట్